

అవిశ్వాసానికి హాజరైన కాంగ్రెస్, బీఆర్ఎస్ కౌన్సిలర్లు

మున్సిపల్ చైర్‌పర్సన్‌పై.. నెగ్గిన అవిశ్వాసం!



కామారెడ్డి మున్సిపల్‌లో సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్ జితేష్ వి.పాటిల్

- క్యాంపు నుంచి నేరుగా మున్సిపల్ కార్యాలయానికి చేరుకున్న కాంగ్రెస్, బీఆర్ఎస్ కౌన్సిలర్లు
- కలెక్టర్ జితేష్ వి.పాటిల్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశం
- బలపరీక్షకు హాజరైన 37 మంది కౌన్సిలర్లు
- చైర్‌పర్సన్‌కు వ్యతిరేకంగా బీఆర్ఎస్ కౌన్సిలర్ల తీర్మానం
- కాంగ్రెస్‌కు మద్దతు తెలిపిన 10 మంది బీఆర్ఎస్ కౌన్సిలర్లు
- హైకోర్టులో పిటిషన్ వేసిన జాహ్నవి
- ఈనెల 12న రానున్న కోర్టు తీర్పు

కామారెడ్డి టౌన్, మార్చి 30: కామారెడ్డి మున్సిపల్ కౌన్సిల్ పీఠాన్ని బీఆర్ఎస్ కోల్పోయింది. కౌన్సిల్ చైర్‌పర్సన్ నిట్టు జాహ్నవిపై కాంగ్రెస్ పెట్టిన అవిశ్వాసం నెగ్గింది. దీంతో బీఆర్ఎస్ కామారెడ్డి మున్సిపాలిటీని కోల్పోవాల్సి వచ్చింది. మున్సిపల్ చైర్‌పర్సన్‌పై ఈనెల 11న కాంగ్రెస్ కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టారు. దీంతో కలెక్టర్ జితేష్ వి.పాటిల్ ఆధ్వర్యంలో మున్సిపల్ అధికారులు శనివారం చైర్‌పర్సన్‌పై పెట్టిన అవిశ్వాసంపై కౌన్సిలర్‌లతో అధికారులు సమావేశాన్ని నిర్వహించి బలపరీక్షను ఏర్పాటు చేశారు. కామారెడ్డి మున్సిపల్ కౌన్సిల్‌లో మొత్తం 49 మంది సభ్యులు ఉండగా అవిశ్వాసం నెగ్గాడానికి 34 మంది సభ్యులు అవసరం ఉంది. అయితే శనివారం జరిగిన బలపరీక్షకు 37 మంది సభ్యులు హాజరై తమ మద్దతును తెలిపారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన 27మంది కౌన్సిలర్లు, బీఆర్ఎస్‌కు చెందిన 10 మంది కౌన్సిలర్లు మద్దతు తెలిపారు. కలెక్టర్ జితేష్ వి.పాటిల్, మున్సిపల్ కమిషనర్ సుజాత ఆధ్వర్యంలో అవిశ్వాస తీర్మానంపై సమావేశం నిర్వహించారు. 37 మంది కౌన్సిలర్లు మున్సిపల్ చైర్‌పర్సన్ నిట్టు జాహ్నవికి వ్యతిరేకంగా చేతులెత్తి మద్దతు తెలిపారు. దీంతో కాంగ్రెస్ అవిశ్వాసం నెగ్గినట్లు అధికారులు ప్రకటించారు. అవిశ్వాస తీర్మానం అనంతరం మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ ఇందుప్రియ మాట్లాడుతూ మున్సిపల్ చైర్‌పర్సన్ నిట్టు జాహ్నవిపై 27 మంది కాంగ్రెస్ కౌన్సిలర్‌లతో అవిశ్వాసం ప్రవేశపెట్టామని తెలిపారు. చైర్‌పర్సన్‌పై అసంతృప్తితో ఉన్న బీఆర్ఎస్‌కు చెందిన మరికొంత మంది కౌన్సిలర్లు సైతం అవిశ్వాసానికి మద్దతు ప్రకటించారని ఆమె వెల్లడించారు.

క్యాంపు నుంచి నేరుగా మున్సిపల్ కార్యాలయానికి..

కామారెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్ నిట్టు జాహ్నవిపై ఈనెల 11న కాంగ్రెస్ కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. కాంగ్రెస్‌కు 27 మంది కౌన్సిలర్లు ఉన్నారు. అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టిన మరుసటిరోజే కౌన్సిలర్లంతా కలిసి క్యాంపునకు తరలి వెళ్లారు. అయితే కాంగ్రెస్ అవిశ్వాసం నెగ్గాలంటే మరో 7 గురు కౌన్సిలర్ల మద్దతు కావాల్సి ఉంది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ ముఖ్యనేతలు బీఆర్ఎస్ పార్టీకి చెందిన 10 మంది కౌన్సిలర్‌లతో సంప్రదింపులు జరిపారు. దీంతో చైర్‌పర్సన్‌పై వ్యతిరేకంగా ఉన్న పది మంది బీఆర్ఎస్ కౌన్సిలర్లు కాంగ్రెస్‌కు మద్దతు తెలిపేందుకు సిద్ధమయ్యారు. వీరంతా వారం రోజుల కిందట క్యాంపుకై గోవా తరలివెళ్లారు. గోవాలో వారం రోజుల పాటు కాంగ్రెస్, బీఆర్ఎస్ కౌన్సిలర్లు క్యాంపులో ఉన్నారు. గోవా నుంచి మూడు రోజుల క్రితం వీరంతా హైదరాబాద్‌లో ఓ రిసార్టుకు చేరుకున్నారు. శనివారం కాంగ్రెస్ కౌన్సిలర్లు ఆ పార్టీ ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ ఆధ్వర్యంలో ప్రత్యేక బస్సులో కామారెడ్డి మున్సిపల్ కార్యాలయానికి చేరుకున్నారు. వేరే క్యాంపులో ఉన్న 10 మంది బీఆర్ఎస్ కౌన్సిలర్లు సైతం వాహనాల్లో కార్యాలయానికి తరలివచ్చి బలపరీక్షకు హాజరయ్యారు.

కాంగ్రెస్‌కు మద్దతు తెలిపిన బీఆర్ఎస్ కౌన్సిలర్లు

కామారెడ్డి మున్సిపల్ అవిశ్వాస సమావేశంలో బీఆర్ఎస్ కౌన్సిలర్లు కాంగ్రెస్‌కు మద్దతు తెలుపడంపై జిల్లాలోనే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. మున్సిపాలిటీలో అవిశ్వాసం నెగ్గాలంటే కాంగ్రెస్‌కు పూర్తి స్థాయిలో బలం లేదు. అయినప్పటికీ బీఆర్ఎస్ మద్దతుతో అవిశ్వాసం కాంగ్రెస్ ప్రవేశపెట్టింది. సొంత పార్టీ చైర్‌పర్సన్‌పైనే పది మంది కౌన్సిలర్లు హఫీజ్, అంజల్ రెడ్డి, భాస్కర్‌గౌడ్, నజీరోద్దీన్, ఇమ్రాన్, వేణు, సుష్మ, స్వప్న, వనిత, అనూషలు వ్యతిరేకంగా తీర్మానం చేయడం ఆ పార్టీ వర్గాలను ఆశ్చర్యానికి గురి చేసింది. అయితే కామారెడ్డి బీఆర్ఎస్‌లోనూ కొందరు ముఖ్యనేతల సహకారంతోనే 10 మంది కౌన్సిలర్లు కాంగ్రెస్‌కు మద్దతు తెలిపారనే ఆరోపణలు వస్తున్నాయి. బీఆర్ఎస్ కౌన్సిలర్లు కాంగ్రెస్‌కు మద్దతు తెలుపడంతోనే కామారెడ్డి మున్సిపల్ పీఠాన్ని కోల్పోవాల్సి వచ్చిందని ప్రస్తుత చైర్‌పర్సన్ నిట్టు జాహ్నవి వర్గీయులు ఆరోపిస్తున్నారు.

హైకోర్టును ఆశ్రయించిన చైర్‌పర్సన్

కాంగ్రెస్ కౌన్సిలర్లు తనపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టడాన్ని నిరసిస్తూ చైర్‌పర్సన్ నిట్టు జాహ్నవి హైకోర్టును ఆశ్రయించారు. కాంగ్రెస్ కౌన్సిలర్లు తనపై పెట్టిన అవిశ్వాసం చెల్లుబాటు కాదంటూ హైకోర్టులో దావా వేశారు. తీర్మానపత్రాలను జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్‌కు అందజేసే సమయంలో తీర్మాన పత్రాలలో కౌన్సిలర్లు నిబంధనల ప్రకారం వివరాలను తెలుపలేదని, ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడి కొత్త మున్సిపల్ చట్టం అమలులో ఉన్నప్పటికీ స్థానిక కలెక్టర్ సైతం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ చట్టం యాక్ట్‌ను నోటీసులో పొందుపరుస్తూ తమకు జారీ చేశారని వంటి లోపాలతో హైకోర్టులో పిటీషన్ వేశారు. దీనిపై కౌన్సిలర్లు, కలెక్టర్ వివరణ ఇవ్వాలని హైకోర్టు ఆదేశించినట్లు చైర్‌పర్సన్ వర్గీయులు తెలిపారు. దీనిపై ఈనెల 12న హైకోర్టులో తీర్పు ఉందన్నారు. ఈ నేపథ్యంలో చైర్‌పర్సన్‌కు అనుకూలంగా కోర్టు తీర్పు ఇస్తే అవిశ్వాస తీర్మానం చెల్లుబాటు కాదని చైర్‌పర్సన్ వర్గీయులు చెబుతున్నారు.

అవిశ్వాస తీర్మానాన్ని నివేదించనున్న మున్సిపల్ అధికారులు

మున్సిపల్ అధికారులు శనివారం నిర్వహించిన అవిశ్వాస తీర్మానాన్ని రాష్ట్ర మున్సిపల్ శాఖకు నివేదించనున్నారు. ప్రభుత్వం నిట్టు జాహ్నవి చైర్‌పర్సన్ పదవిని రద్దుచేసే వరకు ఆమెనే పదవిలో కొనసాగే అవకాశం ఉందని మున్సిపల్ అధికారులు తెలిపారు. ప్రభుత్వం చైర్‌పర్సన్ పదవిని రద్దు చేసి ఎన్నికల కమిషన్‌కు నివేదిస్తోంది. ఆ తర్వాత కొత్త చైర్‌పర్సన్‌ను ఎన్నుకునేందుకు ఎన్నికల కమిషన్ తేదీని ప్రకటించనుంది. అయితే బలపరీక్ష నేపథ్యంలో మున్సిపల్ కార్యాలయం వద్ద ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా గట్టి పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు.



క్యాంపు నుంచి బస్సులో వచ్చిన కాంగ్రెస్ కౌన్సిలర్లు



మున్సిపల్ కార్యాలయం వద్ద భారీ బందోబస్తు



ప్రత్యేక వాహనాల్లో వచ్చిన బీఆర్ఎస్ కౌన్సిలర్లు

అర్హులైన ప్రతీ ఉద్యోగికి పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పించాలి

కలెక్టర్ జితేష్ వి. పాటిల్



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, అధికారులు

కామారెడ్డి టౌన్, మార్చి 30: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల విధులు, పోలింగ్‌కు అత్యవసర సేవల విధులు నిర్వహించే అర్హులైన ప్రతీ ఒక్కరికి తప్పనిసరిగా పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ సౌకర్యం కల్పించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ అన్నారు. శనివారం జిల్లా కలెక్టర్, అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. ఎన్నికల విధులలో పాల్గొనే ప్రతీ ఒక్కరికి తప్పనిసరిగా పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం కల్పించాలని, వీరి కోసం ప్రతీ అసెంబ్లీ సెగ్మెంట్ వద్ద తప్పనిసరిగా ఓటు పెసిలిటేషన్ కేంద్రం ఏర్పాటు చేయాల్సి ఉంటుందని అన్నారు. పోలింగ్ రోజు జిల్లాలో ఎన్నికల విధులు నిర్వహించే పోలింగ్ సిబ్బంది పేరు, ఎంప్లాయి కోడ్, హోదా, మొబైల్ నెంబర్, ఓటరు వివరాలు, అసెంబ్లీ సెగ్మెంట్ వివరాలు, ఓటరు జాబితాలో పార్ట్ అండ్ సీరియల్ నెంబర్, ఓటరు గుర్తింపు కార్డు నెంబర్ మొదలగు వివరాలు రూపొందించాలని, పోలింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్ ప్రక్రియ ముగిసిన వెంటనే సదరు ఉద్యోగులందరికీ తప్పనిసరిగా పోస్టల్ బ్యాలెట్ అందేవిధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఎన్నికల విధులు నిర్వహించే ప్రతీ ఒక్కరికి తప్పనిసరిగా పోస్టల్ బ్యాలెట్ అందించే విధంగా అవసరమైన మేర అదనపు ఫారం 12లు సిద్ధం చేసుకోవాలని తెలిపారు. ఆన్‌లైన్‌లో నమోదు చేసిన ఫారం 12లు సంబంధిత పార్లమెంట్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారుల వద్దకు వెళ్తాయని అన్నారు. ఏప్రిల్ 29 నాటికి పోటీ చేసే అభ్యర్థుల జాబితాను రిటర్నింగ్ అధికారులు సమర్పించాల్సి ఉంటుందని, ఫారం 7ఏ ను సీఈవో కార్యాలయం ధ్రువీకరించిన తర్వాత ఏప్రిల్ 30 నుంచి మే 1, 2024 వరకు రిటర్నింగ్ అధికారి స్థాయిలో పోస్టల్ బ్యాలెట్‌లను ప్రింట్ చేయాలని తెలిపారు. అనంతరం జిల్లా అధికారులతో కలెక్టర్ జితేష్ వి.పాటిల్ మాట్లాడుతూ 85 సంవత్సరాల పైబడి పూర్తిగా నడవలేని సీనియర్ సిటిజన్లకు, నడవలేని దివ్యాంగులకు, కొవిడ్ పేషంట్లకు ఇంటి వద్దనే ఓటు హక్కు వినియోగించుకునే అవకాశాన్ని ఎన్నికల కమిషన్ ప్రవేశపెట్టిందని తెలిపారు. ఇంటి వద్ద ఓటు హక్కు వినియోగించుకోవాలనుకునే వారు ఏప్రిల్ 23లోపు ఫారం 12డీ సమర్పించాలని తెలిపారు. రిటర్నింగ్ అధికారి దరఖాస్తులను పరిశీలించి ఇంటి వద్ద ఓటుహక్కు వినియోగించుకునే అర్హులను ఏప్రిల్ 25 నాటికి ఎంపిక చేస్తారని తెలిపారు. మే 3 నుంచి మే 6 వరకు మొదటిదశ, మే 8న రెండో దశ ఇంటి వద్ద పోలింగ్ పూర్తి చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ జ్యోతి, అధికారులు అనిల్, ఉమలత, సరళ, ఇందిరా ప్రియదర్శిని, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ అవినీతి రహిత పాలన అందిస్తుంది

- ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ



మాట్లాడుతున్న షబ్బీర్‌అలీ

కామారెడ్డి టౌన్, మార్చి 30: కాంగ్రెస్ పార్టీ అవినీతి రహిత పాలన అందిస్తుందని ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ అన్నారు. శనివారం అవిశ్వాస తీర్మానం నిర్వహించిన అనంతరం కాంగ్రెస్ కౌన్సిలర్‌లతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదవిని దుర్వినియోగం చేస్తూ అనేక అవినీతి, అక్రమాలు చేశారని చాలా సార్లు ప్రతిపక్షపార్టీలు ఫిర్యాదు చేశాయని అన్నారు. సొంత పార్టీ కౌన్సిలర్లు సైతం వీరి ఆగడాలపై వారి అధిష్ఠానానికి ఫిర్యాదు కూడా చేశారని ఒక దశలో చైర్‌పర్సన్‌ను మార్చాల్సిందేనని పట్టు బట్టినట్లు తెలిపారు. ఇక మీదట మున్సిపల్ పరిధిలో భూ కబ్జాలు, ఇంటి పర్మిషన్‌లకు లంచాలు లేకుండా అందరికి ఒకేలా పాలన అందించేందుకు కాంగ్రెస్ కృషి చేస్తుందని తెలిపారు.

కోవర్టులతోనే.. చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం!

- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, నియోజకవర్గ ఇన్‌చార్జీలే కోవర్టులు
- గత అసెంబ్లీ ఎన్నికల్లోనూ కేసీఆర్‌ను ఓడగొట్టింది వీరే
- ప్రస్తుతం బీఆర్ఎస్ మున్సిపల్ చైర్‌పర్సన్ పదవిని కోల్పోయేలా చేశారు
- కేటీఆర్ ఫోన్ చేసినా గంప గోవర్ధన్ స్పందించలేదు
- బీఆర్ఎస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, మున్సిపల్ చైర్‌పర్సన్ తండ్రి నిట్టు వేణుగోపాల్‌రావు



కామారెడ్డి, మార్చి 30(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్‌లోని కొందరు ముఖ్యనేతలు కాంగ్రెస్ కోవర్టులుగా పని చేస్తున్నారని ఆ కోవర్టుల వల్లే కామారెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం పెట్టారని బీఆర్ఎస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నిట్టు వేణుగోపాల్‌రావు ఆరోపించారు. కామారెడ్డి నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్, జిల్లా అధ్యక్షుడు ముజిబొద్దీన్‌లు బీఆర్ఎస్ పార్టీలో ఉంటూ కాంగ్రెస్‌కు కోవర్టులుగా పని చేస్తున్నారని విమర్శించారు. గత అసెంబ్లీ ఎన్నిక ల్లో కామారెడ్డి నుంచి మాజీ సీఎం కేసీఆర్ పోటీ చేశారని కేసీఆర్ గెలుపు కోసం వీరిరువురు పని చేయలేదని బీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా వ్యవహరిస్తూ కేసీఆర్ ఓటమికి కారకులయ్యారని తీవ్రంగా ఆరోపించారు. ఇప్పుడు కామారెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్ పీఠాన్ని బీఆర్ఎస్ కోల్పోవడానికి కారణం నియోజకవర్గ ఇన్‌చార్జ్, జిల్లా అధ్యక్షులేనని అన్నారు. కామారెడ్డిలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వేణుగోపాల్‌రావు మాట్లాడారు. కాంగ్రెస్‌కు సంఖ్యా బలం ప్రకారం కామారెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్ పీఠాన్ని బీఆర్ఎస్ కోల్పోయే అవకాశమే లేదన్నారు. అయినప్పటికీ నియోజకవర్గ ఇన్‌చార్జ్, జిల్లా అధ్యక్షుడు రాజకీయ కుట్రలు చేసి బీఆర్ఎస్‌కు చెందిన కౌన్సిలర్‌లను భయభ్రాంతులకు గురిచేసి, చైర్‌పర్సన్‌పై ఉన్న కక్షతో బీఆర్ఎస్‌కు అన్యాయం చేస్తూ కాంగ్రెస్‌కు బీఆర్ఎస్ కౌన్సిలర్‌లు మద్దతు తెలిపేలా కుట్రలు చేశారన్నారు. బీఆర్ఎస్ చైర్‌పర్సన్ నిట్టు జాహ్నవిపై కాంగ్రెస్ కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టిన మరుసటిరోజే తాను జిల్లా అధ్యక్షుడు ముజిబొద్దీన్‌ను సంప్రదించి మన పార్టీకి 16 మంది కౌన్సిలర్లు ఉన్నారు. వారందరిని కాపాడుకుంటే కాంగ్రెస్ అవిశ్వాసం నెగ్గదని సూచించానన్నారు. కౌన్సిలర్‌లతో నియోజకవర్గ ఇన్‌చార్జ్ గంప గోవర్ధన్ సమావేశం ఏర్పాటు చేయాలని కోరానన్నారు. అయితే నియోజకవర్గ ఇన్‌చార్జ్ కౌన్సిలర్‌లతో సమావేశం వద్దని జిల్లా అధ్యక్షుడు తనతో తెలిపాడు. అప్పటికే 8 మంది కౌన్సిలర్లు మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంట్లో కాంగ్రెస్‌కు మద్దతు తెలిపేందుకు సిద్ధమయ్యారని ఈ విషయాన్ని మరోసారి జిల్లా అధ్యక్షుడి దృష్టికి తీసుకెళ్లానని అన్నారు. అయినప్పటికీ కౌన్సిలర్‌లతో సమావేశం ఏర్పాటు చేయించలేదన్నారు. జిల్లా అధ్యక్షుడు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌ల నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో తానే నేరుగా బీఆర్ఎస్‌కు చెందిన 8 మంది కౌన్సిలర్‌లతో సంప్రదింపులు జరిపానన్నారు. నియోజకవర్గ ఇన్‌చార్జ్‌తో చెప్పిస్తే తామంతా కాంగ్రెస్‌కు మద్దతు తెలుపకుండా విరమించుకుంటామని వారు చెప్పారన్నారు. చైర్‌పర్సన్ నిట్టు జాహ్నవిని పదవి నుంచి దింపాలనే ఉద్దేశ్యంతోనే నియోజకవర్గ ఇన్‌చార్జ్ జిల్లా అధ్యక్షుడు రాజకీయం చేశారని సదరు కౌన్సిలర్‌లను భయభ్రాంతులకు గురిచేసి కాంగ్రెస్‌కు మద్దతు తెలిపేలా చేశారని ఆరోపించారు. జిల్లా అధ్యక్షుడు ముజిబొద్దీన్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గంప గోవర్ధన్‌లు డబ్బుకు అమ్ముడుపోయి కుట్రలు చేసి బీఆర్ఎస్‌కు చెందిన పది మంది కౌన్సిలర్‌లను కాంగ్రెస్‌కు మద్దతు తెలిపేలా క్యాంపునకు తరలించారని ఆరోపించారు. ఈ విషయమై పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లానని అన్నారు. కేటీఆర్ సైతం స్పందించి తన పీఏతో నియోజకవర్గ ఇన్‌చార్జ్ గంప గోవర్ధన్‌కు ఫోన్ చేసినా స్పందించలేదన్నారు. త్వరలో జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లోనూ బీఆర్ఎస్ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్‌కు వ్యతిరేకంగా పని చేసేందుకు నియోజకవర్గ ఇన్‌చార్జ్, జిల్లా అధ్యక్షుడు వారి వర్గం సిద్ధమైందని వారిని నమ్మవద్దని కోరారు. బీఆర్ఎస్ కార్యకలపాలకు వ్యతిరేకంగా వ్యవహరించిన కామారెడ్డి నియోజకవర్గ ఇన్‌చార్జ్ గంప గోవర్ధన్, జిల్లా అధ్యక్షుడు ముజిబొద్దీన్, చైర్‌పర్సన్‌కు వ్యతిరేకంగా తీర్మానం చేసిన 10 మంది కౌన్సిలర్‌లను పార్టీ నుంచి వెంటనే సస్పెండ్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. తాను పార్టీ మారుతున్నట్లు కొందరు అసత్యప్రచారం చేశారన్నారు. ఈ విలేకరుల సమావేశంలో కౌన్సిలర్లు నిట్టు కృష్ణమోహన్, నాయకులు ముప్పారపు ఆనంద్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

కోడ్ కూసినా.. కానరాని నిబంధనలు

- గ్రామాల్లో విచ్చల విడిగా బెల్ట్ షాపులు
- అర్ధరాత్రి వరకు కొనసాగుతున్న దుకాణాలు
- కన్నెత్తి చూడని సంబంధిత అధికారులు

ఎల్లారెడ్డి రూరల్, మార్చి 30: పార్లమెంట్ ఎన్నికల కోడ్ కూసింది. కానీ ఎల్లారెడ్డి మండలంలోని కోడ్ నిబంధనలు అమలు కావడం లేదు. గ్రామాల్లో విచ్చలవిడిగా వెలిసిన బెల్ట్‌షాపుల్లో అర్ధరాత్రి వరకు మద్యం అమ్మకాలు కొనసాగుతున్నాయి. యథేచ్ఛగా షాపులు నిర్వ హిస్తున్నా సంబంధిత అధికారులు మామూళ్లు తీసుకుంటున్నారు. కొందరు మద్యం దుకాణదారులు గ్రామాల్లో బెల్ట్ షాపుల నిర్వాహకులను ప్రోత్సహిస్తూ మద్యం సరఫరా చేస్తున్నట్లు తెలుస్తోంది.

60కి పైగా బెల్టు షాపులు

ఎల్లారెడ్డి మండలంలోని 31 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఆయా పంచాయతీల పరిధిలోని బెల్ట్ షాపులు ఒక్కో గ్రామంలో 2,3 వరకు బెల్టుషాపులు నిర్వహిస్తున్నారు. కొన్ని గ్రామాల్లో అర్ధరాత్రి వరకు మద్యం అమ్మకాలు జరుగుతున్నాయని మందుబాబులు మద్యం తాగి గ్రామాల్లో రెచ్చిపోతున్నారని బెల్ట్ షాపుల వల్ల పేద కుటుం బాలు రోడ్డు మీద పడుతున్నాయని మద్యానికి బానిసై గ్రామాల్లో గొడవలకు దారి తీస్తున్నాయని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.

అమలు కాని ఎన్నికల నిబంధన

పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కమిషన్ మార్చి 16 నుంచి కోడ్ అమలులోకి వచ్చింది. అనుమతి ఆధారాలు లేకుండా రూ.50వేలకు మించి నగదు తీసుకెళ్లరాదని గ్రామాల్లో బెల్టు షాపులు నిర్వహించవద్దని మద్యం అమ్మకాలుల చేయవద్దు అని ఈ నిబంధనలు తమకేమి పట్టనట్లు కొందరు గ్రామాల్లో యథేచ్ఛగా మద్యం అమ్మకాలు చేస్తున్నారు. ఎన్నికల్లో నిబంధనలు పకడ్బందీగా అమలు చేసినా ప్రస్తుతం ఇంకా పూర్తిస్థాయిలో చర్యలు చేపట్టడంలో అధికారులు దృష్టి సారించడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామాల్లో అర్ధరాత్రి వరకు మద్యం అమ్మకాలు జరుగకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం

- షాకీర్ అహ్మద్, ఎక్సైజ్ సీఐ

ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినందు వల్ల ఎల్లారెడ్డి సర్కిల్ వ్యాప్తంగా బెల్టు దుకాణాలు లేకుండా చూస్తున్నాం. ఇప్పటి వరకు కొన్ని షాపులను బంద్ చేయించాం. బెల్టుషాపు నిర్వహిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటాం.

నింబాచల క్షేత్రానికి పోటెత్తిన భక్తులు

భీమ్‌గల్ రూరల్, మార్చి 30: మండలంలోని లింబాద్రి గుట్టపై శ్రీనింబాచల లక్ష్మీనరసింహ స్వామిని దర్శించుకోవడానికి శనివారం భక్తులు పోటెత్తారు. ఉదయం 5గంటల నుంచి మండలం నుంచే కాకుండా వివిధ మండలాల నుంచి భక్తులు స్వామి వారిని దర్శించుకోవడానికి కాలినడకన గుట్టకు చేరుకున్నారు. క్యూలైన్‌లో నిల్చొని గర్భగుడిలోని స్వామి వారిని దర్శించుకున్నారు. గోవింద నామస్మరణలతో లింబాద్రిగుట్ట మార్మోగింది. నారికేళాలు కొట్టి మొక్కులు చెల్లించుకుని అన్నదానంలో పాల్గొన్నారు.

'ధాన్యాన్ని దళారులకు అమ్ముకోవద్దు'

సిరికొండ మార్చి 30: ఆరు గాలం కష్టించి పండించిన ధాన్యాన్ని దళారులకు అమ్ముకుని నష్ట పోవద్దని డీఆర్‌డీవో పీడీ సాయగౌడ్ రైతులను కోరారు. సిరికొండ మండలంలో ఐకేపీ ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను పీడీ ప్రారంభించారు. సిరికొండ, పెద్దవాల్గోట్, కొండాపూర్,గడ్కోల్ తదితర గ్రామాల్లో కేంద్రాలను ప్రారంభించిన అనంతరం రైతులతో పీడీ మాట్లాడారు. గ్రామాల్లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించుకోవాలని ఆయన కోరారు.

వాహనాల తనిఖీలో నగదు పట్టివేత

ఖిల్లా, మార్చి 30: నగరంలోని ఒకటో టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో గల కుమార్‌గల్లీ ప్రాంతంలో శనివారం పోలీసులు వాహనాల తనిఖీ చేస్తున్నారు. అయితే, అనుమానాస్పదంగా వెళ్తున్న ఒక వాహనాన్ని నిలిపి తనిఖీ చేస్తుండగా.. ఎటువంటి ఆధారులు లేకుండా రూ.4 లక్షల ఎనిమిది వేల నగదును పోలీసులు గుర్తించారు. ఆ డబ్బును ఎటువంటి ఆధారాలు చూపకపోవడంతో వాటిని స్వాధీనం చేసుకున్నారు. తదుపరి చర్యల కోసం ఆదాయ పన్నులశాఖ అధికారులకు అప్పగించారని ఒకటో టౌన్ ఎస్‌హెచ్‌వో డి.విజయబాబు తెలిపారు. డబ్బులు తరలిస్తున్న వ్యక్తి శివప్రసాద్ అనే వ్యక్తి ఫైనాన్స్ వ్యాపారం చేస్తున్నట్టు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

టీవీ, సోషల్ మీడియా చానళ్లలో తప్పుడు ప్రచారం

» 10 సంస్థలకు నోటీసులు పంపా: కేటీఆర్

హైదరాబాద్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): కొన్ని టీవీ చానళ్లతోపాటు, యూట్యూబ్, సోషల్ మీడియా సంస్థలకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ లీగల్ నోటీస్‌లు పంపించారు. ఇప్పటికే పలు చానళ్లకు లీగల్ నోటీస్‌లు పంపిన కేటీఆర్.. శనివారం మరో 10 సంస్థలకు లీగల్ నోటీస్‌లు పంపించారు. తనను, తన కుటుంబాన్ని బద్నాం చేయాలనే కుట్రలో భాగంగా అసత్య ప్రచారాలు, కట్టు కథలు అల్లుతున్నాయని, అందుకే ఆయా మీడియా సంస్థలకు నోటీసులు పంపినట్లు కేటీఆర్ వెల్లడించారు. మీడియా ముసుగులో అవన్నీ కుట్ర చేస్తున్నాయని ఆయన ఆరోపించారు. అయితే ఇప్పటికే కొన్ని మీడియా సంస్థలు తప్పు తెలుసుకుని వీడియోలు తీసివేసినట్లు తనకు సమాచారం అందించాయన్నారు. వారంలోగా మిగతా చానళ్లు కూడా తీసివేయాలని, లేదంటే వాటిపై చట్టప్రకారం ముందుకెళ్తామని శనివారం కేటీఆర్ ఒక ప్రకటనలో తెలిపారు.

కేసీఆర్ అవినీతిపై సమగ్ర విచారణ జరపాలి

» విదేశాలకు పారిపోకుండా పాస్‌పోర్టును సీజ్ చేయాలి

» హుస్నాబాద్ పోలీస్‌స్టేషన్‌లో జేఏసీ ఫిర్యాదు

హుస్నాబాద్, మార్చి 30: బీఆర్ఎస్ పది సంవత్సరాల పాలనలో మాజీ సీఎం కేసీఆర్ చేసిన అవినీతిపై సమగ్ర విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని శనివారం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పోలీస్ స్టేషన్‌లో నియోజకవర్గ జేఏసీ నాయకులు ఫిర్యాదు చేశారు. అవినీతికి పాల్పడిన కేసీఆర్, మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, కవిత, సంతోష్‌రావు విదేశాలకు పారిపోకుండా వారి పాస్‌పోర్టులు సీజ్ చేయాలని కోరారు. కాళేశ్వరం ప్రాజెక్టు, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, సచివాలయనిర్మాణం, వరంగల్ జైలు కూల్చివేత, గొర్ల పంపిణీ, దళిత బంధు, ప్రైవేట్ విశ్వవిద్యాలయాలకు అనుమతులు, ధరణి పేరిట భూ కబ్జాలు తదితర అంశాలపై రూ.లక్షల కోట్ల అవినీతి జరిగిందని ఆరోపించారు.

ఏళ్లు గడిచినా గుర్తింపు లేదని..

» సీఎం నివాసం వద్ద కాంగ్రెస్ కార్యకర్త ఆత్మహత్యాయత్నం

బంజారాహిల్స్, మార్చి 30, (ఆంధ్రజ్యోతి): పార్టీలో చేరి సంవత్సరాలు గడుస్తున్నా తనకు తగిన ప్రాధాన్యం ఇవ్వడం లేదని ఓ కాంగ్రెస్ కార్యకర్త సీఎం నివాసం వద్ద ఆత్మహత్యాయత్నం చేశాడు. వరంగల్ జిల్లా భూపాలపల్లికి చెందిన కృష్ణ సాగర్ నగరంలోని రాజీవ్‌నగర్‌లో నివాసం ఉంటూ వ్యాపారం చేస్తున్నాడు. కాంగ్రెస్ కార్యకర్తగానూ వ్యవహరిస్తున్నాడు. జూబ్లీహిల్స్‌లోని సీఎం రేవంత్ రెడ్డి నివాసం వద్దకు శనివారం కారులో వచ్చాడు. సీఎంను కలిసేందుకు ప్రయత్నించగా భద్రతా సిబ్బంది వారించారు. దీంతో కృష్ణ సాగర్ తనతో తెచ్చుకున్న డీజిల్ పోసుకొని నిప్పు అంటించుకుంటానంటూ బెదిరించాడు. అక్కడే ఉన్న పోలీసులు స్పందించి జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కృష్ణసాగర్ మాట్లాడుతూ తాను సీఎం రేవంత్‌తోపాటు టీడీపీ నుంచి కాంగ్రెస్‌లోకి వచ్చినట్టు చెప్పాడు. పార్టీలో ఏళ్లుగా పనిచేస్తున్నా గుర్తింపు లేదని ఆవేదన వ్యక్తం చేశాడు.

జూన్ 1 నుంచి ఇంటర్ కాలేజీల ప్రారంభం

హైదరాబాద్, మార్చి 30(ఆంధ్రజ్యోతి): వచ్చే విద్యాసంవత్సరానికి (2024-25) సంబంధించిన అకడెమిక్ క్యాలండర్‌ను ఇంటర్ బోర్డు శనివారం ప్రకటించింది. దీనిప్రకారం జూన్ 1 నుంచి కొత్త విద్యాసంవత్సరం తరగతులు ప్రారంభమవుతాయి. నవంబరు 18 నుంచి అర్ధ సంవత్సర పరీక్షలు, 2025 జనవరి 20 నుంచి ప్రీఫైనల్, ఫిబ్రవరి మొదటివారంలో ప్రాక్టికల్ పరీక్షలు, మార్చి మొదటివారంలో వార్షిక పరీక్షలు ఉంటాయని బోర్డు తెలిపింది.

పోలీస్ టు పొలిటికల్



(మొదటి పేజీ తరువాయి)

మలుపు తిరిగింది. "సాధారణంగా టాస్క్‌ఫోర్స్ బృందాలు, స్పెషల్ ఆపరేషన్ బృందాలు ఎన్నికల సమయంలో సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక పోలింగ్ బూత్‌లపై దృష్టిపెడతాయి. స్ట్రైకింగ్ ఫోర్స్, స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్ పేరుతో ఈ బృందాలు తమకు వచ్చిన సమాచారం మేరకు ఏ నియోజకవర్గంలోనైనా పర్యటిస్తాయి. అనుమానితులను సోదా చేస్తాయి. వీరి వాహనాలను ఇతర తనిఖీ బృందాలు అడ్డగించవు" అని ఓ విశ్రాంత పోలీసు అధికారి వివరించారు. దీన్నిబట్టి రాధాకిషన్‌రావు తమకు ఉన్న అధికారాలను, వెసులుబాట్లను దుర్వినియోగం చేసి, డబ్బు తరలించి ఉంటారని దర్యాప్తు అధికారులు అంచనాకు వచ్చారు. ఎవరి కోసం డబ్బు తరలించారు? ఎవరికి అందజేశారు? అనే ప్రశ్నలకు రాధాకిషన్‌రావు నోరు విప్పితే.. రాజకీయ నాయకుల పాత్ర బయటకు వస్తుందని తెలుస్తోంది. ప్రస్తుతం జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్న రాధాకిషన్‌రావును కోర్టు అనుమతితో కస్టడీకి తీసుకుని, విచారించేందుకు పంజాగుట్ట పోలీసులు సిద్ధమవుతున్నారు. ట్యాపింగ్‌తోపాటు.. నగదు తరలింపు వెనక ఉన్న రాజకీయ శక్తులెవరనేది రాధాకిషన్ విచారణలో తేలుతుందని దర్యాప్తు అధికారులు భావిస్తున్నారు. రాధాకిషన్‌ను ఏయే అంశాలపై ప్రశ్నించాలి? అనే దానిపై ఉన్నతాధికారుల బృందం ఇప్పటికే ఓ ప్రశ్నావళిని సిద్ధం చేసినట్లు సమాచారం. "పోలీసు వాహనాల్లో డబ్బులు తరలించాలని ఆదేశించిన నాయకులెవరు? ఎన్నిసార్లు నగదును తరలించారు? ఎక్కడి నుంచి ఎక్కడికి చేరవేశారు? ఎవరికి అందజేశారు? ఆ నగదును ఎక్కడి నుంచి సర్దుబాటు చేశారు? ఈ కుట్రలో ఇంకా ఎవరెవరికి భాగస్వామ్యం ఉంది?" అనే ప్రశ్నలకు రాధాకిషన్ నుంచి సమాధానాలు రాబట్టేందుకు సిద్ధమవుతున్నట్లు తెలిసింది. ఈ ప్రశ్నలకు రాధాకిషన్‌రావు నోరు తెరిస్తే.. గత ప్రభుత్వ పెద్దలు, బీఆర్ఎస్ ముఖ్య నాయకులు అరెస్టయ్యే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. అంతేకాదు.. మనీలాండరింగ్ కోణం ఉండడంతో.. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) కూడా రంగంలోకి దిగే సూచనలున్నాయి. కాగా, ఈ కేసులో మాజీ డీఎస్పీ ప్రణీత్‌రావుది తొలి అరెస్టు కాగా.. ఆయనను అదే రోజు సస్పెండ్ చేశారు. అదనపు ఎస్పీలు భుజంగరావు, తిరుపతన్న కూడా 48 గంటలకు మించి జైలులో ఉన్న నేపథ్యంలో నిబంధనల ప్రకారం వారిని సస్పెండ్ అయినట్లే..! అయితే.. సోమవారం అధికారికంగా సస్పెన్షన్ ఉత్తర్వులు వెలువడతాయని డీజీపీ కార్యాలయ వర్గాలు తెలిపాయి.

చంచల్‌గూడ జైలుపై నిరంతర నిఘా..!

ఫోన్ ట్యాపింగ్ సంచలన కేసు కావడంతో.. నిందితులు జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్న చంచల్‌గూడ జైలుపై ఉన్నతాధికారులు నిఘా పెంచారు. ప్రస్తుతం భుజంగరావు, తిరుపతన్న పోలీసు కస్టడీలో ఉండగా.. ప్రణీత్‌రావు, రాధాకిషన్‌రావు జైలులో ఉన్న విషయం తెలిసిందే..! దీంతో వారి బ్యారెక్‌లు, కదలికలు, ములాఖత్‌కు వస్తున్నవారిపై ఉన్నతాధికారులు నిఘా పెంచారు. ఎస్ఐబీ నుంచి డీఎస్పీ స్థాయి నేతృత్వంలోని ఓ బృందం ఈ నిఘాను పర్యవేక్షిస్తోంది.

అదుపులో ముగ్గురు ఇన్‌స్పెక్టర్లు..?

ఈ కేసులో ఇప్పటి వరకు ఇంటెలిజెన్స్ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావు, టాస్క్‌ఫోర్స్ మాజీ డీసీపీ(ఓఎ్‌స్‌డీ) రాధాకిషన్‌రావు, మాజీ అదనపు ఎస్పీలు భుజంగరావు, తిరుపతన్న, మాజీ డీఎస్పీ ప్రణీత్‌రావు, ఐ న్యూస్ ఎండీ శ్రవణ్‌రావు నిందితులుగా ఉన్న విషయం తెలిసిందే! వీరితోపాటు.. ఐదుగురు ఇన్‌స్పెక్టర్లు కూడా పాత్రధారులేనని దర్యాప్తు అధికారులు భావిస్తున్నారు. ఈ ఐదుగురిలో ఇద్దరు ఇప్పటికే విచారణకు హాజరయ్యారు. తాజాగా.. మరో ముగ్గురు ఇన్‌స్పెక్టర్లను అదుపులోకి తీసుకుని, బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో విచారిస్తున్నట్లు తెలిసింది. వీరు గతంలో ఎస్ఐబీలో పనిచేశారా..? లేక టాస్క్‌ఫోర్స్‌లో రాధాకిషన్ టీమ్‌లో పనిచేశారా..? ఫోన్‌ట్యాపింగ్‌తో నేరుగా సంబంధం ఉందా? లేక రాధాకిషన్‌రావు ఆదేశాలతో వ్యాపారుల ప్రొఫైల్స్ తయారు చేసి, అక్రమ వసూళ్ల దందాకు పాల్పడ్డారా? అనే వివరాలు తెలియాల్సి ఉంది. మరోవైపు.. భుజంగరావు, తిరుపతన్న కింద పనిచేసిన సిబ్బందిపైనా అధికారులు ఆరా తీస్తున్నారు.

కేకేకు బీఆర్ఎస్ ఏం అన్యాయం చేసింది?

» ఆయనకు రెండుసార్లు రాజ్యసభ.. కూతురికి మేయర్ పదవి ఇచ్చాం

» కష్టకాలంలో పార్టీని వీడడం దురదృష్టకరం

» కాంగ్రెస్ పాలనలో అందరికీ అన్యాయం

» ఆరు నెలల్లో అధికారం బీఆర్ఎస్‌దే: హరీశ్



గజ్వేల్, మార్చి 30: "బీఆర్ఎస్ కేశవరావు(కేకే)కు రెండుసార్లు రాజ్యసభ ఎంపీగా అవకాశమిచ్చింది. ఆయన కూతురికి మేయర్ పదవి.. కొడుక్కి కార్పొరేషన్ చైర్మన్ పదవులు కూడా ఇచ్చింది. పార్టీలో పెద్ద మనిషిగా కేకేకు కేసీఆర్ ఎప్పుడూ గౌరవం ఇచ్చే వారు. కేసీఆర్ ఆయనకు ఏం అన్యాయం చేశారు? కష్టకాలంలో పార్టీని వదిలిపోవడం దురదృష్టకరం" అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు ప్రశ్నించారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్ అసెంబ్లీ నియోజకవర్గ బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం శనివారం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా శామీర్‌పేటలోని ఓ గెస్ట్‌హౌజ్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. పార్టీ కష్టకాలంలో ఉండగా విడిచి పెట్టి వెళ్లిన వాళ్లను తర్వాత కాళ్లు మొక్కినా తీసుకోబోమని చెప్పారు. తమకు నష్టం చేసిన వారిని విడిచి పెట్టేది లేదని, లెక్కలు రాస్తున్నామని, తర్వాత వడ్డీతో సహా తీర్చుకుంటామన్నారు. రాష్ట్రంలో వంద రోజుల కాంగ్రెస్ పాలనలో అన్ని వర్గాల ప్రజలు ఆగమయ్యారని, కాంగ్రెస్ ఇచ్చిన హామీలు నీటి బుడగలు అని, ఉద్దెర పథకాలు మొదలు పెట్టారని ఎద్దేవా చేశారు. మళ్లా బోర్లు వేసే కాలం వచ్చిందని, మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతున్నాయని, ఆరు నెలలు ఓపిక పడితే భవిష్యత్తు బీఆర్ఎస్‌దేనని, మళ్లీ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని చెప్పారు. గజ్వేల్ అభివృద్ధిని ఓర్వలేని బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌కు ఎందుకు ఓట్లు వేయాలని ప్రశ్నించారు. గజ్వేల్ అభివృద్ధిని అడ్డుకునే ప్రయత్నం చేసిన రఘునందన్ గురించి గ్రామాల్లో చర్చ పెట్టాలని హరీశ్‌రావు సూచించారు.

అందరికీ పనులు చేశా

తాను మంత్రిగా ఉన్నప్పుడు అందరికీ అన్ని పనులు చేశానని, సమాయాభావం వల్ల కడుపు నిండా మాట్లాడలేకపోయానని, ఇక నుంచి నా ప్రాణం అడ్డం పెట్టి అయినా కార్యకర్తల వెంట ఉంటానని హరీశ్‌రావు అన్నారు. ఏప్రిల్ 2న పూర్తిస్థాయిలో కార్యకర్తల సమావేశం నిర్వహించి మాట్లాడుకుందామని చెప్పారు.

కామారెడ్డి మునిసిపాలిటీలో నెగ్గిన అవిశ్వాసం

» చైర్‌పర్సన్ పదవిని కోల్పోయిన జాహ్నవి

» వనపర్తిలో హైడ్రామా.. బీఆర్ఎస్‌కు 8 మంది రాజీనామా

కామారెడ్డి/మహబూబ్‌నగర్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కామారెడ్డి మునిసిపల్ కౌన్సిల్ పీఠాన్ని బీఆర్ఎస్ కోల్పోయింది. మునిసిపల్ చైర్‌పర్సన్ నిట్టు జాహ్నవిపై కాంగ్రెస్ కౌన్సిలర్లు ప్రతిపాదించిన అవిశ్వాస తీర్మానానికి 10 మంది బీఆర్ఎస్ కౌన్సిలర్లు కూడా మద్దతు తెలిపారు. దీంతో బీఆర్ఎస్ పార్టీ.. కామారెడ్డి మున్సిపాలిటీని కోల్పోవాల్సి వచ్చింది. కామారెడ్డి మునిసిపల్ చైర్‌పర్సన్‌పై ఈనెల 11 న కాంగ్రెస్ కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టారు. దీంతో అధికారులు శనివారం బలపరీక్ష సమావేశం నిర్వహించారు. కామారెడ్డి మున్సిపల్ కౌన్సిల్‌లో మొత్తం 49 మంది సభ్యులు ఉండగా.. అవిశ్వాసం నెగ్గడానికి 34 మంది సభ్యుల అవసరం ఉంది. అయితే, శనివారం జరిగిన బలపరీక్షకు కాంగ్రెస్ పార్టీకి చెందిన 27 మంది కౌన్సిలర్లు, బీఆర్ఎస్‌కు చెందిన 10 మంది కౌన్సిలర్లు హాజరై అవిశ్వాసానికి మద్దతు తెలిపారు. దీంతో కాంగ్రెస్ అవిశ్వాస తీర్మానం నెగ్గిందని అధికారులు ప్రకటించారు. కాగా, కాంగ్రెస్ కౌన్సిలర్లు తనపై అవిశ్వాస తీర్మానం చెల్లుబాటు కాదని పేర్కొంటూ చైర్‌పర్సన్ నిట్టు జాహ్నవి హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై ఈనెల 12న తీర్పు వెలువడే అవకాశం ఉందని పేర్కొన్నారు. మరోవైపు వనపర్తి మునిసిపాలిటీలో మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డికి షాక్ తగిలింది. కౌన్సిలర్లు ఎవరూ పార్టీని వీడొద్దన్న ఉద్దేశంతో చైర్మన్ గట్టు యాదవ్, వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్‌తో ఆయన రాజీనామా చేయించిన విషయం తెలిసిందే. అయితే, శనివారం 8 మంది కౌన్సిలర్లు బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి, కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు ప్రకటించారు. గత మునిసిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున ఐదుగురు సభ్యులు గెలువగా, ఆ తర్వాత బీజేపీ నుంచి ఇద్దరు, బీఆర్ఎస్ నుంచి ఇద్దరు ఆ పార్టీలో చేరారు. టీడీపీకి ఒక కౌన్సిలర్ ఉండగా ఆమె కూడా కాంగ్రెస్‌కే మద్దతు తెలుపుతున్నారు. తాజాగా 8 మంది కౌన్సిలర్ల రాజీనామాతో కాంగ్రెస్ బలం 18కి చేరనుంది. దీంతో మొత్తం 33మంది కౌన్సిలర్లున్న వనపర్తి మునిసిపల్ పీఠాన్ని కాంగ్రెస్ చేజిక్కించుకోవడం ఖాయంగా కనిపిస్తోంది.

ప్రశాంతంగా ముగిసిన టెన్త్ పరీక్షలు

బోధన్ రూరల్, మార్చి30: బోధన్, సాలూర మండలాలలో పదోతరగతి పరీక్షలు శనివారంతో ప్రశాంతంగా ముగిశాయి. బోధన్, సాలూర మండలాల్లో 2915 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 2909 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారని ఆరుగురు విద్యార్థులు గైర్హాజరు అయ్యారని మండల విద్యాశాఖ అధికారి నాగనాథ్ తెలిపారు.పదోతరగతి పరీక్ష కేంద్రాలలో ఎటువంటి మాస్ కాపీయింగ్ జరుగకుండా పకడ్బందీ చర్యలు చేపట్టామన్నారు, ప్రభుత్వ పాఠశాలలో ఉత్తీర్ణత శాతం అధికంగా వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

కమ్మర్‌పల్లి:ఈనెల 18 నుంచి ప్రారంభమైన పదోతరగతి పరీక్షలు శనివారంతో ముగిసాయి. చివరి రోజు పరీక్ష కేంద్రాల నుంచి విద్యార్థులు ఆనందోత్సవాలతో నృత్యం చేశారు. కమ్మర్‌పల్లి మండలంలో హసాకొత్తూర్, చౌట్‌పల్లి కోనాసముందర్, కమ్మర్‌పల్లి నాలుగు సెంటర్లుగా మండలంలోని 7 ప్రభుత్వ, 1 కస్తూర్బా, శ్రీవిద్యాసాయి, మిసిమి, విజ్ఞానజ్యోతి,ఉషాజ్యోతి ప్రైవేట్ పాఠశాలకు చెందిన 466 మంది విద్యార్థిణి విద్యార్థులు (కోనాసముందర్ సెంటర్లో ఒక విద్యార్థి గైర్‌హాజర్) ప్రతిరోజు సెంటర్లకు హాజరై పరీక్షలు రాసినట్లు,పరీక్ష కేంద్రాలలో పరీక్షలు ప్రశాంతగ సాగాయని మండల విద్యాశాఖ అధికారి ఆంధ్రయ్య తెలిపారు. పరీక్షలు ప్రశాంతంగా ముగియడంతో ఇటు విద్యార్థులు, అటు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సైతం ఊపిరి పీల్చుకున్నాట్లయింది. పరీక్షలు బాగా రాశామని మంచిఫలితాలు సాధిస్తామని విద్యార్థులు ఆశాభావం వ్యక్తం చేశారు

ఎడపల్లి: ఎడపల్లి మండల కేంద్రంలోని రెండు పరీక్ష కేంద్రాలతో పాటు జానకంపేట గ్రామంలో గల పదవ తరగతి పరీక్ష కేంద్రాలలో నిర్వహించిన పదవ తరగతి పరీక్షలు శనివారంతో ప్రశాంతంగా ముగిశాయి. మండలంలోని మూడు కేంద్రాలలో 379 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 379 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారని ఒక్కరు కూడా గైర్హాజరు కాలుదని మండల విద్యాశాఖ అధికారి రామారావు తెలిపారు. పదవ తరగతి పరీక్ష కేంద్రాలలో ఎటువంటి మాస్ కాపీయింగ్ జరుగకుండా పకడ్బందీ చర్యలు చేపట్టామన్నారు, ప్రభుత్వ పాఠశాలలో గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం ఉత్తీర్ణత శాతం అధికంగా వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.



పరీక్షలు రాసి బయటకు వస్తున్న విద్యార్థులు

పెర్కిట్: ఈనెల 18న ప్రారంభమైన, పదవ తరగతి పరీక్షలు శనివారంతో ముగిశాయి. ఆర్మూర్ మండలంలోని 14 కేంద్రాలలో నిర్వహించిన పరీక్షలు ప్రశాంతంగా జరిగాయనిఎంఈవో రాజగం గారాం తెలిపారు.1893విద్యార్థులకు గాను నలుగురు విద్యార్థులు గైర్హాజరు కాగా1989 విద్యార్థులు పరీక్షలు రాసినట్టు ఆయన తెలిపారు.

రుద్రూరు: రుద్రూరు మండలంలోని రెండు పరీక్షా కేంద్రాల్లో నిర్వహించిన టెన్త్ పరీక్షలు శనివారం ప్రశాంతంగా ముగిసాయి. పరీక్షలు ప్రశాంతంగా ముగియడంతో పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థులు ఆనందంతో సందడి చేశారు. శనివారం నిర్వహించిన పరీక్షకు 372 మందికి గాను ఒకరు గైర్హాజరయ్యారు.

ముప్కాల్: ఈనెల 18న ప్రారంభమైన పదవ తరగతి పరీక్షలు శనివారం ప్రశాంతంగా ముగిశాయి. ముప్కాల్, బాల్కొండ, మెండోర ఉమ్మడి మండలాల్లో ఒక్కరు మీనహ విద్యార్థులందరు పదవ తరగతి పరీక్షలకు హాజరయ్యారు.

ఆలూర్‌లో సజ్జ పంట పరిశీలన

ఆర్మూర్‌రూరల్, మార్చి30: వ్యవసాయ శాఖ అధికారులు, కృషి విజ్ఞాన కేంద్రం రుద్రూర్ శాస్త్రవేత్తలు శనివారం ఆలూర్ మండల కేంద్రంలోని సజ్జ పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయాధికారి వాజిద్‌హుస్సేన్ మాట్లాడుతూ సజ్జ పంటలో కత్తెరు పురుగు సోకి తెగులు ఉధృతంగా ఉన్నందున నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. సజ్జ పంట 40నుంచి 50రోజుల దశలో ఉన్నట్టు గుర్తించారు. వేడి వాతావరణంలో పురుగు యొక్క వివిధ దశల్లో గుడ్లు, లద్దే పురుగు, రెక్కల పురుగు ముగించుకొని విచ్చలవిడిగా పంటను నష్టపరుస్తుందని అన్నారు. రైతులు విత్తనం విత్తుకునే ముందు కిలో విత్తనాలకు ఆరు మిల్లీమీటర్ల సాయంత్రనిలిప్రోల్ మందును తయోమితిక్సన్‌తో కలిపి విత్తనశుద్ధి చేసుకోవాలని సూచించారు. పంటలో బాగా ఎదిగిన లార్వలను గమనించినట్లయితే పది కిలోల తౌడు, రెండు కిలోల బెల్లంను, రెండు లీటర్ల నీటిలో కరిగించి 12నుంచి 14గంటలు పులియబెట్టాలని, పంట వేసే సమయానికి అర గంట ముందు మిశ్రామానికి వంద గ్రాముల పొడి థయోమెతిక్సిన్ మందుతో కలిసి ఉండాలుగా తయారు చేసుకున్న విషపు ఎరలను సాయంత్రం వేలలో మొక్క సుడులలో వేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం రుద్రూర్ శాస్త్రవేత్తవిజయ్‌కుమార్, ఏడీఏ,ఏఈవో, రైతులు పాల్గొన్నారు.

ముప్కాల్:మండలంలో కత్తెర పురుగు సోకిన సజ్జ పంట పొలాలను వ్యవసాయాధికారులు కృషి విజ్ఞాన కేంద్రం రుద్రూర్ శాస్త్రవేత్త విజయ్ అన్నారు. శనివారం ముప్కాల్, బాల్కొండ మండలాల్లో వరి పంటలను పరిశీలించారు. వరి, సజ్జ పంటలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం సజ్జ పంటలో కత్తెర పురుగు ఉధృతి అధికంగా ఉన్నట్టు ఆయన గమనించినట్టు తెలిపారు. వేడి వాతావరణంలో కత్తెర పురుగు, జీవిత చక్రం తొందరగా ముగించుకొని పంటను విచ్చలవిడిగా ఆశించి తీవ్రంగా నష్టపరుస్తుందని తెలిపారు. విత్తనము విత్తుకునే ముందు విత్తన శుద్ధి పాయలో అలాగే ఎకరానికి 8నుంచి పది లింగాకరషక బుట్టలను పంటకు ఒక ఫీట్ ఎత్తున అమర్చుకోవాలని, ఎదిగిన లార్వాలు పంటలో గమనించినట్లయితే విషపు ఏర ఉండలుగా చేసుకొని సాయంత్రం వేళల్లో మొక్క సుడులలో వేసుకోవాలని, విషపు ఎర తయారు చేసుకోవడానికి పది కిలోల తౌడు, రెండు కిలోల నల్ల బెల్లం, తయోమిలాక్సమ్ క్లోరోపైరీపాస్ ఉపయోగించుకోవాల న్నారు. రసాయ నివారణ చర్యల్లో భాగంగా క్లోరాంత్ర నిలిప్రోల్ 0.4ఎంఎల్ స్పైనారోరం, 0.5ఎంఎల్ తయోమెతక్సి, లాండాసాహలోత్రిన్ 0.25ఎంఎల్ లీటర్ నీటిని ఏదేని ఒక దానిని 200లీటర్ల నీటిలో కలుపుకొని పిచికారి చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో భీమ్‌గల్ వ్యవసాయ ఏడీఏ మల్లయ్య, మండల వ్యవసాయాధికారి మహేందర్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు



ఆలూర్‌లో సజ్జ పంటను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి వాజీద్ హుస్సేన్

పంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలి

బోధన్ రూరల్, మార్చి30: గ్రామ పంచాయితీ కార్మికులకు రావాల్సిన పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని ఐఎఫ్‌టియు ఆధ్వర్యంలో సాలూర తహసీల్దార్ కార్యాలయం ఎదుట శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా నాయకులు మల్లేష్ మాట్లాడుతూ సాలూర, తగ్గెల్లి, ఖాజాపూర్, హున్స, మందర్న తదితర గ్రామాల్లో పని చేసుతన్న పంచాయితీ కార్మికులకు రావాల్సిన బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. గతంలో సమ్మె చేసిన కాలపు వేతనాలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ కార్మికులు శంకర్, గంగాధర్, సతీష్, రాములు, రాహుల్, సాయిలు, తదితరులు ఉన్నారు.

తేలికగా ఆంగ్ల బోధనపై దృష్టిసారించాలి

ధర్పల్లి, మార్చి 30: విద్యార్థులకు ఆంగ్ల బోధనపై మక్కువ కనబర్చే విధంగా ఆటపాటల ద్వారా ఆంగ్లాన్ని సులభంగా అర్థమయ్యే విధంగా నేర్పించాలని లిటిల్ హార్ట్స్ పాఠశాల కరస్పాండెంట్ శ్రీకాంత్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోగల పాఠశాలలో ఇల్ ఫెస్ట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులకు ఆంగ్ల మధ్యమానికి సంబంధించి అన్ని విషయాలను పాటలు, నాటికలు, నృత్య రూపంలో సులభతరంగా ఏ విధంగా నేర్చుకోవచ్చో వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సాధన, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రారంభమైన ఇందూరు తిరుమల బ్రహ్మోత్సవాలు



ప్రారంభమైన ఇందూరు తిరుమల బ్రహ్మోత్సవాలు

మోపాల్, మార్చి 30: మండలంలోని నర్సింగ్‌పల్లి గ్రామంలోని ఇందూరు తిరుమల తిరుపతి వెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం కన్నుల పండుగగా శ్రీశ్రీశ్రీ గంగోత్రి రామానుజ దాసు స్వామి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ చేయగా బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి.బ్రహ్మోత్సవాలు అంటే అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకుడు వెంకటేశ్వరస్వామికి చాలా ఇష్టమని లోకకళ్యాణార్థం చేస్తున్న బ్రహ్మోత్సవాలు అంటే స్వామివారికి అత్యంత ప్రీతికరమని గంగోత్రి స్వామి అన్నారు. బ్రహ్మోత్సవాలలో పాల్గొంటే అధిక పుణ్యఫలమని అన్నారు. అదేవిధంగా ఇందూరు తిరుమల బ్రహ్మోత్సవాలు అత్యంత కన్నుల పండుగగా జరగడం ఈ ప్రాంతానికి శుభిక్షం అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సంగీత దర్శకులు, గురువులు రామాచారి, ఆలయ ధర్మకర్తలు నర్సింహారెడ్డి, విజయసింహారెడ్డి, యజ్ఞాచార్యులు శ్రీమన్నారాయణ శిఖామణి, శ్రీఖరాచార్యులు, సంపత్‌కుమార ఆచార్య, రోహిత్ కుమార ఆచార్య, రవీందర్‌యాదవ్, నరాల సుధాకర్, నర్సింహారెడ్డి, భాస్కర్, ప్రసాద్, రమేష్, మురళి, నరేందర్, సురేష్, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

'ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి మతిభ్రమించి మాట్లాడుతున్నారు'

భీమ్‌గల్‌రూరల్, మార్చి30: భీమ్‌గల్ పట్టణంలో ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి నిర్వహించిన రైతు ధర్నాలో బీఆర్ఎస్ కార్యకర్తలు తప్ప రైతులు లేరని, 100 రోజుల కాంగ్రెస్ పాలనలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేస్తున్న అభివృద్ధిని చూసి బాల్కొండ నియోజక వర్గ ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి మతిభ్రమించి మాట్లాడుతున్నారని కాంగ్రెస్‌పార్టీ మండలాధ్యక్షుడు బొదిరెస్వామి అన్నారు. శనివారం భీమ్‌గల్ పట్టణంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల విలేకరుల సమావేశం నిర్వహించారు. రైతులకు అన్ని విధాల అండగా కాంగ్రెస్ పార్టీ నిలుస్తుందని, మానిఫేస్టో లో ప్రకటించిన రూ.500ల బోనస్ ను కూడా రైతులకు చెల్లిస్తామని, ప్రశాంత్ రెడ్డి కి అంతగా మదనపడాల్సిన అవసరం లేదని, బిఆర్ఎస్ పాలనలో మంత్రి ప్రశాంత్ రెడ్డి చేపట్టిన చెక్‌డ్యాంలతో రైతులు నట్టేట మునిగిపోయారని, వేల కోట్లు దండుకున్న ప్రశాంత్‌రెడ్డి అతి తొందరలో జైలుకు వెళ్లడం ఖాయమని అన్నారు. ఈ కార్యక్రమంలో డిసిసి డెలిగేట్ కుంట రమేష్, నర్సయ్య, గోపాల్ నాయక్, అనంతరావ్, నాగేంద్ర, సాయిబాబా, నల్లూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్స్‌డే సందర్భంగా వైద్యులకు సన్మానం

ఎడపల్లి, మార్చి30: జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా శనివారం ఎడపల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న వైద్యులు వినీత్, వెంకటేష్‌లను ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది, ఏఎన్ఎం రేఖ కిరణ్ గౌడ్ దంపతులు ఘనంగా సన్మానించారు.ఈసందర్భంగా వారిని శాలువాలతో సన్మానించి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం వైద్యులు మాట్లాడుతూ వైద్యుల దినోత్సవం సందర్భంగా వారిని సన్మానించినందుకు సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎచ్ఈఓ,ఏఎన్ఎంలు భారతీ,జీవమ్మ,పుష్ప,గంగామణి,లక్ష్మి,తదితరులు ఉన్నారు.

నిత్యం హనుమాన్ చాలీసా పఠిస్తే సకల శుభాలు

బోధన్ రూరల్, మార్చి30: నిత్యం హనుమాన్ చాలీసా పఠిస్తే సకల శుభాలు కలుగుతాయని హనుమాన్ మాలధారణ చాలా పవిత్రమైనదని వేద పండితులు ప్రవీణ్ మహారాజ్ అన్నారు. శనివారం బోధన్ పట్టణంలోని మారుతి మందిరంలో ఆంజనేయ స్వామికి ప్రత్యేక అలంకరణ చేసి వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతీ రోజు హిందువులు ఆలయ ప్రదక్షిణ చేసి హనుమాన్ చాలీసా, శివ నామస్మరణలు జపిస్తే కోరిన కోరికలు నెరవేరి సకల శుభాలు కలుగుతాయన్నారు.ప్రత్యేక పూజల్లో డాక్టర్ అవినాష్ రెడ్డి భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డికి సన్మానం

ఆర్మూర్‌టౌన్, మార్చి30: మున్సిపల్ పరిధిలోని బైపాస్ రోడ్డులో కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డిని శనివారం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు. జిల్లా కేంద్రానికి వెళ్తున్న జీవన్‌రెడ్డిని కాంగ్రెస్ నాయకులు ఘనంగా స్వాగతం పలికి పట్టుశాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నియోజ కవర్గ ఇన్ చార్జీ పొద్దుటూరి వినయ్‌కుమార్‌రెడ్డి, ఆలూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ముక్కెర విజయ్, సెక్రెటరీ నవనీత్, ఉదయ్, నారాయణ, సంజీవ్, వంశీ, మహేష్, మోతె శీను, ముత్యం, హరిష్, పవన్, చిరంజీవి, గంగాధర్, సాయి, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో పలువురి చేరిక..

ఆలూర్ మండల కేంద్రానికి చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీలో వినయ్‌రెడ్డి సమక్షంలో చేరారు. మాజీవార్డు మెంబర్‌లు ఉమ్మెడ చిన్న గంగారెడ్డి, గంగారెడ్డి, రాము, హరిష్, కుమ్మరి సంఘం సభ్యులు చిన్నసాయన్న, పెద్ద సాయన్న, ముకేష్‌లతో పాటు 50మంది కాంగ్రెస్ పార్టీలో చేరగా వారికి వినయ్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు.

ఎయిడ్స్ పై అవగాహన ర్యాలీ

మోర్తాడ్, మార్చి30: మండల కేంద్రంలోని ఎన్ఎస్ఎస్ విద్యార్థులు శనివారం ఎయిడ్స్ పై ర్యాలీ నిర్వహించారు. నేషనల్ హైవే ఎస్సీ, బీసీ కాలనీ పాలెం రోడ్డు వరకు ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో ప్లాస్టిక్ నివారణ కోసం నినాదాలు చేశారు. ఆడ పిల్లల్ని చదివించాలని, పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు అంటు నినాదాలు చేశారు. ఈ కార్యక్ర మంలో వైస్‌ప్రిన్సిపాల్ పాషా అతికుల్లా, ప్రోగ్రాం అధికారి భూపతి, దశరథ్, రవీందర్, సతీష్ కుమార్, సాగర్, మహేష్, ప్రసాద్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బీర్కూర్‌లో ఇద్దరు బైక్ దొంగల అరెస్టు

● 26 ద్విచక్ర వాహనాల స్వాధీనం


బీర్కూర్‌లో పోలీసులు స్వాధీనం చేసుకున్న ద్విచక్ర వాహనాలు

బీర్కూర్, మార్చి 30 : మండల కేంద్రంలో శనివారం ఇద్దరు బైక్ దొంగలను పోలీసులు అరెస్టు చేశారు. ఇద్దరు దుండగులను అదుపులోకి తీసుకున్న పోలీసులు నిందితుల వద్ద నుంచి 26 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. శనివారం బీర్కూర్ మండల కేంద్రంలోని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో డీఎస్పీ సత్యనారాయణ మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ప్రతిరోజూ లాగే శనివారం ఉదయం బీర్కూర్ పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్నారు. సరిగ్గా అదే సమయంలో నెంబర్ ప్లేట్ లేని పల్సర్ వాహనంపై వచ్చిన ఇద్దరు వ్యక్తులు పోలీసులను చూసి పారిపోయారు. అనుమానం వచ్చిన పోలీసులు వారిని వెంబడించి పట్టుకున్నారు. వారిని విచారించగా బోధన్ పట్టణంలోని అనిషానగర్‌కు చెందిన మహ్మద్ అబ్దుల్ అయాజ్ ఖాన్, బోధన్ పట్టణంలోని రాకాసిపేట్‌కు చెందిన మహ్మద్ సమీరుద్దీన్‌లుగా పోలీసులు గుర్తించారు. సమీరుద్దీన్ 9వ తరగతి విద్యార్థిని అని డీఎస్పీ తెలిపారు. ఇదిలా ఉండగా వీరిద్దరూ గత కొంత కాలంగా ఎలాంటి పనులు చేయకుండా మద్యానికి బానిసై జులాయిగా తిరుగుతున్నారని అన్నారు. కామారెడ్డి జిల్లాలోని పిట్లం, బాన్సువాడ, బీర్కూర్, సదాశివనగర్, గాంధారి, భిక్కనూరు, నిజామాబాద్ జిల్లాలోని ఆర్మూర్, నిజామాబాద్, కమ్మర్‌పల్లి, ఇందల్వాయి, సంగారెడ్డి జిల్లాలోని పెద్ద శంకరంపేట్, కల్హేర్ తదితర గ్రామాల్లో రాత్రివేళల్లో తిరుగుతూ ఇళ్ల ముందు నిలిపి ఉంచిన ద్విచక్ర వాహనాలను దొంగిలించి అమ్ముకునే వారని తెలిపారు. వాహనాలు అమ్మగా వచ్చిన డబ్బులతో జల్సాలు చేసే వారని అన్నారు. ఈ క్రమంలో వీరిని బీర్కూర్ పోలీసులు శనివారం ఉదయం బీర్కూర్‌లో పట్టుకుని ఉమ్మడి నిజామాబాద్ జిల్లా, సంగారెడ్డి జిల్లాలోని 26 బైక్‌లను స్వాధీనం చేసుకున్నారని తెలిపారు. వీరిద్దరి నేర చరిత్ర వివరిస్తూ ఒక్కొక్కరిపై 26 కేసులు నమోదయ్యాయని వివరించారు. ఇద్దరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు. ఈ కేసును ఛేదించిన సీఐ సత్యనారాయణగౌడ్, బీర్కూర్ ఎస్సై రాజు, శేఖర్, పిట్లం ఎస్సై నరేష్, రఘు, సాయిబాబా, శివచరణ్, సంగమేశ్వర్‌లను డీఎస్పీ సత్యనారాయణ అభినందించారు.

ప్రభుత్వం రైతులకు రుణమాఫీ చేయాలి

● సొసైటీ చైర్మన్ ఏర్వల కృష్ణారెడ్డి


మహాజన సభలో మాట్లాడుతున్న సొసైటీ చైర్మన్ కృష్ణారెడ్డి

బాన్సువాడ టౌన్, మార్చి 30: ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రకటించినట్లుగా రైతులకు 2 లక్షల రుణమాఫీ చేయాలని బాన్సువాడ సొసైటీ చైర్మన్ ఏర్వల కృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని సొసైటీ కార్యాలయ ఆవరణలో మహాజన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సొసైటీ సీఈవో నారాయణరెడ్డి జమ ఖర్చుల వివరాలను ప్రజలకు చదివి వినిపించారు. అనంతరం సొసైటీ చైర్మన్ ఏర్వల కృష్ణారెడ్డి మాట్లాడుతూ జిల్లా స్థాయిలో అన్ని రకాల కలెక్షన్‌లను 100 శాతం సాధించిన సొసైటీగా బాన్సువాడ సొసైటీ నిలిచిందన్నారు. మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి సొసైటీ నూతన భవనానికి 75 లక్షల రూపాయల నిధులను కేటాయించినందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే రైతు కళ్లల్లో ఆనందం చూశామన్నారు. మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పాలిట శాపంలా మారిందన్నారు. అన్నదాతను ఆదుకోవాల్సిన ప్రభుత్వం అప్పుల ఊబిలోకి నెట్టేస్తోందని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే రైతులకు 2 లక్షల రుణమాఫీ చేయాలని, వరి ధాన్యం కొనుగోలులో రూ.500 అదనంగా చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సొసైటీ డైరెక్టర్లు, రైతులు తదితరులున్నారు.

భిక్కనూరు టోల్‌గేట్ వద్ద లారీ బీభత్సం

● టోల్ రెండు బూత్‌లు ధ్వంసం, ఒకరికి గాయాలు


ప్రమాదంలో ధ్వంసమైన టోల్‌గేట్ బూత్

భిక్కనూరు, మార్చి 30: మండలంలోని 44వ జాతీయరహదారిపై ఉన్న టోల్‌గేట్ వద్ద శనివారం తెల్లవారుజామున కంటైనర్ లారీ బీభత్సం సృష్టించింది. పోలీసులు, టోల్ సిబ్బంది కథనం ప్రకారం.. కామారెడ్డి వైపు నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న కంటైనర్ లారీ (ఎంహెచ్ 40 సీఎం 1661) అతివేగంగా వచ్చి టోల్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నాలుగు, ఐదో బూత్‌లు ధ్వంసం కాగా నాల్గవ బూత్‌లో విధులు నిర్వహిస్తున్న మండలంలోని తిప్పాపూర్ గ్రామానికి చెందిన బాబుకు గాయాలయ్యాయి. వెంటనే ప్రమాదానికి కారణమైనా లారీ డ్రైవర్‌ను పట్టుకుని, గాయపడిన బాబును చికిత్స నిమిత్తం కామారెడ్డికి ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని లారీని పోలీసుస్టేషన్‌కు తరలించామని ఎస్సై సాయికుమార్ తెలిపారు.

నేడు విద్యుత్ అంతరాయం

బిచ్కుంద, మార్చి30: బిచ్కుంద సబ్‌స్టేషన్‌లో ట్రాన్స్‌ఫార్మర్‌ల మరమ్మతుల కారణంగా ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 1 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ అధికారులు తెలిపారు. పెద్దదేవాడ, సిరిసముదర్, చిన్నదేవాడ, చిన్నదడ్గి, పెద్దదడ్గి, దల్తాపూర్, పత్లాపూర్, కందర్‌పల్లి, రాజుల, ఆర్‌డబ్ల్యుఎస్, గ్రామాల్లో విద్యుత్ సరాఫరా ఉండదని తెలిపారు.

ఎంపీవో శ్రీనివాస్ సేవలు ప్రశంసనీయం

● జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్‌రావు

నాగిరెడ్డిపేట, మార్చి30: నాగిరెడ్డిపేట ఎంపీవో శ్రీనివాస్ సుమారు ఐదు సంవత్సరాలుగా మండల ప్రజలకు అందించిన సేవలు ఎంతో ప్రశంసనీయమని జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్‌రావు అన్నారు. ఎంపీవో శ్రీనివాస్ పదవివిరమణ చేయడంతో శనివారం జరిగిన ఆయన పదవి విరమణ కార్యక్రమానికి డీపీవో శ్రీనివాస్‌రావు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రతీ ఉద్యోగికి పదవివిరమణ తప్పదన్నారు. తన ఉద్యోగ బాధ్యతలను శ్రీనివాస్ సక్రమంగా నిర్వహించి మండల ప్రజల మన్ననలు పొందారన్నారు. ప్రభుత్వం చేపట్టే వివిధ పథకాలను, కార్యక్రమాలను మండలంలో సకాలంలో అమలుపరుస్తూ మండలాన్ని జిల్లాలో ముందు వరుసలో ఉంచడానికి శ్రీనివాస్ ఎంతో కృషి చేసేవారని కొనియాడారు. కార్యక్రమంలో నారాయణ్‌ఖేడ్ మున్సిపల్ కమిషనర్ జీవన్, ఎల్లారెడ్డి డీఎల్ పీవో సురేందర్, బోధన్ డీఎల్పీవో సాయిబాబా, నాగిరెడ్డి పేట ఎంపీడీవో పర్బన్న, వివిధ మంలాల ఎంపీవోలు ప్రవీణ్, బ్రహ్మం, ప్రకాష్, యాదగిరి, విఠల్ రెడ్డి, మండల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

'మాదిగలపై కాంగ్రెస్ చిన్నచూపు'

కామారెడ్డి రూరల్, మార్చి30: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం మాదిగలపై చిన్నచూపు చూస్తుందని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి పోట్టిగిసీ శంకర్ అన్నారు. కామారెడ్డిలో శనివారం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 70 నుంచి 80 లక్షల మాదిగ జనాభా ఉందని అన్నారు. రాష్ట్రంలో ఉన్న మూడు పార్లమెంట్ ఎస్సీ రిజర్వుడ్ స్థానాలలో రెండుస్థానాలు మాల సామాజిక వర్గానికి, ఒకటి బైండ్ల సామాజికవర్గానికి కేటాయించడంతో మాదిగలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని అన్నారు. శాసనసభ ఎన్నికల బహిరంగసభలో సీఎం రేవంత్‌రెడ్డి 'మాదిగలు నా ఓటు బ్యాంకు' అని చెప్పుకుంటూ ఓట్లు వేయించుకొని గెలిచి ఇప్పుడు ఒక్క ఎంపీ సీటు ఇవ్వకపోతే మాదిగలు గుణపాఠం చెప్తారని హెచ్చరిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు నడుపుల రామస్వామి,కొడి భూపతి బసవరాజ్ తదితరులు ఉన్నారు.

కల్లు దుకాణంపై పోలీసుల దాడి

● అల్ఫాజోలాన్ని స్వాధీనం చేసుకున్న పోలీసులు ● ఒకరి రిమాండ్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ

లింగంపేట, మార్చి30: మండలంలోని మెంగారం గ్రామంలో శనివారం పోలీసులు కల్లు దుకాణంపై దాడిచేసి నిషేధిత మత్తు పదార్థమైన అల్ఫాజోలం 2గ్రాములు స్వాధీనం చేసుకుని దుకాణాన్ని సీజ్ చేసినట్లు ఎల్లారెడ్డి సీఐ రవీందర్ తెలిపారు. లింగంపేట పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో సీఐ వివరాలు వెల్లడించారు. మెంగారం గ్రామంలో మత్తుపదార్థలను ఉపయోగించి కల్తీ కల్లు తయారు చేస్తున్నారన్న పక్క సమాచారం మేరకు ఎస్సై చైతన్య కుమార్ తన సిబ్బందితో వెళ్లి కల్లు దుకాణంపై దాడిచేయగా అల్ఫాజోలం రెండు గ్రాములు దొరికినట్లు ఆయన చెప్పారు. దొరికిన అల్ఫాజోలం విలువ రూ.40వేలు ఉంటుందని ఆయన వివరించారు. కల్లు డిపో నిర్వాహకుడు గోవర్ధన్‌గౌడ్‌పై నార్కోటిక్కు డ్రగ్స్ (ఎన్‌డీ)యాక్టు కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఆయన తెలియజేశారు. ఐదు కల్లు సిసాలను సీజ్‌చేసి ల్యాబ్‌కు పంపనున్నట్లు తెలిపారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు లింగంపేట మండలం పరిధిలోని కల్లు దుకాణాలను తనిఖీలు చేపట్టినట్లు ఆయన తెలిపారు. ఎల్లారెడ్డి సర్కిల్ పరిధిలోని నాగిరెడ్డిపేట, లింగంపేట, ఎల్లారెడ్డి మండలాలలోని కల్లు దుకాణాలను తనిఖీ చేపట్టి ఆరు కల్తీ కల్లు కేసులు నమోదు చేసిట్లు ఆయన తెలియజేశారు. సర్కిల్ పరిధిలోని కల్లు వ్యాపారులు ప్రజల ఆరోగ్యాలతో చెలగాటమాడవద్దని సూచించారు. కల్తీ కల్లు విక్రయించే వ్యక్తులపై చట్టపరమైన కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.



ఆర్డీవో కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న కార్మికులు

బకాయి వేతనాలు చెల్లించాలని కార్మికుల ధర్నా

బాన్సువాడ టౌన్, మార్చి 30: ఏజెన్సీ నిర్వాహకులు తమకు నాలుగు నెలల బకాయి వేతనాలు చెల్లించాలంటూ శనివారం ఆస్పత్రి కార్మికులు ఆర్డీవో కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు దుబాస్ రాములు మాట్లాడుతూ బాన్సువాడ ఏరియాస్పత్రి, ఎంసీహెచ్‌లలో పని చేస్తున్న శానిటేషన్, పేషెంట్‌కేర్, సెక్యూరిటీ గార్డులకు ఏజెన్సీ నిర్వాహకులు గత నాలుగు నెలలుగా వేతనాలు చెల్లించడం లేదన్నారు. వేతనాలు సకాలంలో చెల్లించకపోవడంతో కార్మికులు నానా ఇబ్బందులు పడుతున్నారని, కుటుంబ పోషణ భారంగా మారిందన్నారు. అధికారులు స్పందించి కార్మికులకు బకాయి వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో రోజుకో తీరున నిరసన కార్యక్రమాలు చేపడతామని ఆయన హెచ్చరించారు. అనంతరం ఆర్డీవో కార్యాలయ సిబ్బంది డీఏవో సువర్ణకు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో రేణుక, సురేఖ, భారతి, గంగారాం, వినోద, లక్ష్మీ, గంగారాం తదితరులున్నారు.


మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారిణి భాగ్యలక్ష్మీ

ఎరువులను ఈ పాస్ యంత్రాల ద్వారా విక్రయించాలి

● జిల్లా వ్యవసాయ అధికారిణి భాగ్యలక్ష్మీ

మద్నూర్, మార్చి 30: రైతులకు రాబోయే వర్షాకాలంలో విత్తనాలు, ఎరువులు సకాలంలో అందించాలని, అన్ని దుకాణాల్లో ఎరువులు, విత్తనాలు సిద్ధంగా ఉంచాలని జిల్లా వ్యవసాయాధికారిణి భాగ్యలక్ష్మీ సూచించారు. రైతులకు విక్రయించే ఎరువులను ఈ పాస్ ద్వారా విక్రయించాలన్నారు. శనివారం ఉమ్మడి మద్నూర్ మండలంలోని ఆయా గ్రామాల్లో ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. అనంతరం మద్నూర్ రైతు వేదికలో ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పంటల యాజమాన్య పద్ధతులపై వారంలో రెండు సార్లు సూచనలు, సలహాలు ఇవ్వడం జరుగుతుందని సూచించారు. రైతులు రైతు వేదికలకు వచ్చి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొనాలన్నారు. ఆమెతో పాటు ఏవో రాజు, ఎఈవో గజానంద్, తదితరులున్నారు.


ఎల్లారెడ్డిలో వడ్డీ వ్యాపారుల ఇంట్లో సోదాలు చేస్తున్న పోలీసులు

వడ్డీ వ్యాపారులపై పోలీసుల దాడులు

ఎల్లారెడ్డి రూరల్, మార్చి 30 : ఎస్పీ ఆదేశాల మేరకు ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని ఓ వడ్డీ వ్యాపారులపై శుక్రవారం రాత్రి ఎల్లారెడ్డి ఎస్ఐ బొజ్జ మహేష్ దాడులు నిర్వహించి వారి వద్ద ఉన్న మూడు ప్రామిసరీ నోట్లు, పదిహేను బ్యాంకు చెక్కులు, అగ్రికల్చర్ ల్యాండ్ సేల్ డీడీ, నాలుగు జతల వెండి పట్టీలు, ఒక గోల్డ్ చైన్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎల్లారెడ్డి ఎస్ఐ బొజ్జ మహేష్ తెలిపారు.

పెంచిన ఫీజులను వెంటనే తగ్గించాలి

కామారెడ్డి రూరల్, మార్చి 30: తెలంగాణ విశ్వవిద్యాలయంలోని ఎగ్జామినేషన్స్ బ్రాంచ్ నుంచి సర్టిఫికేట్‌లను జారీ చేయడానికి పెంచిన ఫీజులను వెంటనే తగ్గించాలని ఏబీవీపీ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం కామారెడ్డిలో వారు మాట్లాడుతూ ఎగ్జామినేషన్స్ బ్రాంచ్ నుంచి సర్టిఫికేట్‌లను జారీ చేయడానికి ఫీజులను పెంచడాన్ని వారు తీవ్రంగా ఖండించారు. యూనివర్సిటీలో కాన్వొకేషన్ ఫీజులను రూ.700 నుంచి రూ.3,500 పెంచడం చాలా బాధాకారం. అలాగే ట్రాన్స్‌స్క్రిప్ట్‌ల ఫీజు కూడా రూ.100 నుంచి రూ.200 పెంచడాన్ని ఏబీవీపీ ఖండిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ చరణ్, జిల్లా హాస్టల్ కన్వీనర్ ఖలీల్, రోహిత్, మురళి, సిద్దు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన పదవ తరగతి పరీక్షలు

బాన్సువాడ టౌన్, మార్చి 30: ఈ నెల 18 నుంచి ప్రారంభమైన పదవ తరగతి పరీక్షలు శనివారంతో ముగిశాయి. ఈ పరీక్షలకు గాను అధికారులు బాన్సువాడలో 5 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్షా కాలంలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని విధాల ఏర్పాట్లు చేశారు. పరీక్షలు సజావుగా సాగేందుకు సహకరించిన అధికారులకు, ఉపాధ్యాయులకు, పాఠశాల సిబ్బందికి, విద్యార్థుల తల్లిదండ్రులకు బాన్సువాడ మండల విద్యాధికారి నాగేశ్వరరావు ధన్యవాదాలు తెలిపారు.


పల్లకీ సేవతో ఊరేగింపుగా వెళ్తున్న దృశ్యం

ప్రారంభమైన సిద్ధరామేశ్వర ఆలయ బ్రహ్మోత్సవాలు

● స్వామివారికి ప్రత్యేక పూజలు

భిక్కనూరు, మార్చి 30: భిక్కనూరు మండలకేంద్రంలోని దక్షిణకాశీగా బాసిల్లుతున్న శ్రీసిద్ధరామేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా మొదటిరోజు ఉదయం స్వామివారిని ప్రత్యేకంగా ఆలయ అర్చకులు అలంకరించి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పుణ్యాహవచనము, మాతృకనాంది, అంకురార్పణము, అఖండదీపారాధణ, స్వామివారికి మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన కార్యక్రమాలను వేదబ్రహ్మణుల మంత్రోచ్చరణల నడుమ నిర్వహించారు. మధ్యాహ్నం డప్పువాయిద్యాల నడుమ పల్లకీసేవను శ్రీసిద్ధగిరి సమాధి వరకు ఊరేగింపు నిర్వహించారు. అనంతరం అర్చకులు భక్తులకు తీర్థప్రసాదాల వితరణ చేశారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. కార్యక్రమంలోభక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

నేడు బీఆర్ఎస్ విస్తృతస్థాయి సమావేశం

● హాజరుకానున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు

కామారెడ్డి టౌన్/లింగంపేట, మార్చి 30: జిల్లాలో కామారెడ్డి, లింగంపేటలో ఆదివారం నిర్వహించనున్న నియోజకవర్గ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశానికి సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు రానున్నట్లు బీఆర్ఎస్ నాయకులు తెలిపారు. పట్టణ కేంద్రంలోని సత్యగార్డెన్‌లో నిర్వహించే కామారెడ్డి నియోజకవర్గ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశానికి సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు రానున్నట్లు నియోజకవర్గ ఇన్‌చార్జ్ మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ తెలిపారు. మండలకేంద్రంలోని జీఎస్ఆర్ గార్డెన్‌లో నిర్వహిస్తున్న ఎల్లారెడ్డి నియోజకవర్గ కార్యకర్తల సమావేశానికి హరీశ్‌రావు వస్తున్నట్లు బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు రమేష్ తెలిపారు. సమావేశానికి బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్‌లు హాజరవుతారని తెలిపా రు. నియోజకవర్గంలోని ప్రతీ కార్యకర్త హాజరుకావాలని కోరారు.

ఏఎస్ఆర్ ఫౌండేషన్ మండల కమిటీ ఎన్నిక

బీర్కూర్, మార్చి30: మండలకేంద్రంలో శనివారం ఏఎస్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు అయ్యల సంతోష్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. సమావేశంలో బీర్కూర్ మండల ఏఎస్ఆర్ ఫౌండేషన్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఏఎస్ఆర్ ఫౌండేషన్ మండల అధ్యక్షుడిగా షేక్ అజీమోద్దీన్, ప్రధాన కార్యదర్శి లింగప్ప, కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అయ్యల సంతోష్ మాట్లాడుతూ ఏఎస్ఆర్ ఫౌండేషన్ అక్షరం, ఆరోగ్యం, అభివృద్ధి అనే నినాదంతో పని చేస్తోందని, ప్రతీ గ్రామానికి సేవా కార్యక్రమాలు విస్తరించే విధంగా సభ్యుల సహకారంతో ముందుకు సాగుతామన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఆర్ ఫౌండేషన్ జిల్లా అధ్యక్షుడు బంగారు రవి, జిల్లా నాయకులు బొప్పని శ్రీనివాస్, సంగు బాలకృష్ణ, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

చెక్‌పోస్టు వద్ద రూ.2.71లక్షల పట్టివేత

మాచారెడ్డి, మార్చి30: మండలంలోని ఘన్‌పూర్ చెక్‌పోస్టు వద్ద పోలీసులు చేపట్టిన తనిఖీల్లో ఎలాంటి ఆధారాలు లేకుండా ఓ వ్యక్తి తరలిస్తున్న రూ.2లక్షల 71వేలను పట్టుకున్నట్లు పోలీసులు తెలిపారు. సరైన ధ్రువపత్రాలు చూపకపోవడంతో ఆ డబ్బులను సీజ్ చేసినట్లు తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో కోడ్ అమలులో ఉన్నందున రూ.50 వేలకు మించి డబ్బులు తరలించరాదని తెలిపారు.

పేద యువతి వివాహానికి సామగ్రి అందజేత

భిక్కనూరు, మార్చి30: మండలంలోని కాచాపూర్ గ్రామంలో నిరుపేద యువతి నిమ్మాజు రేఖ వివాహానికి మాజీ ఎమ్మెల్యే గంపగోవర్ధన్, ఆయన తనయుడు శశాంక్ శనివారం వావాహ సామగ్రిని అందజేశారు. ఈ మేరకు వాటిని గ్రామపెద్దలు యువతి కుటుంబసభ్యులకు అప్పగించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బాలకిషన్, సుల్తానా, భాగ్యలక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జగదాంబ ఆలయ వార్షికోత్సవం

గాంధారి, మార్చి30: మండలం వెంకటపూర్‌లోని శ్రీజగదాంబ- శ్రీసేవాలాల్ మహారాజ్ మందిరం 20వ వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. జాతరలో పౌరాదేవి పీఠాధిపతి బాబు సింగ్ మహారాజ్‌తో కలిసి ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు. పోచారం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతీ సంవత్సరం జగదాంబ వార్షిక ఉత్సవంలో పాల్గొంటానని అన్నారు. మాజీ సీఎం కేసీఆర్ ఆలయాలకు ఎన్నో విధులను అభివృధి చేశారని పేర్కొన్నారు. గిరిజనులకు అత్యంత పవిత్రమైన సేవాలాల్ ఉత్సవాలను ఘనంగా నిర్వహించడం ఎంతో సంతోషకరమని తెలిపారు. పోచారం శ్రీనివాస్‌రెడ్డిని బంజారా నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా బంజారా సేవా సమితి అధ్యక్షుడు బద్యానాయక్, జిల్లా రైతుసమన్వయ సమితి అధ్యక్షులు దుద్దిల అంజిరెడ్డి, బాన్సువాడ మున్సిపల్ చైర్మన్ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

బీబీపేట, మార్చి30: మండలంలోని జనగామ గ్రామశివారులోని ఎడ్లకట్టవాగు నుంచి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను పెట్రోలింగ్ సమయంలో పట్టుకున్నట్లు ఎస్సై ప్రభాకర్ శనివారం తెలిపారు. ఈ మూడు ట్రాక్టర్లను పోలీసుస్టేషన్‌కు తరలించి కేసు నమోదుచేసినట్లు ఎస్సై తెలిపారు.


పోలీసులు పట్టుకున్న ఇసుక ట్రాక్టర్లు

మహాజన సభకు తరలివెళ్లిన విండో చైర్మన్లు

భిక్కనూరు, మార్చి30: ది ఇందూర్ జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ లిమిటెడ్ 55వ మహాజన సభకు భిక్కనూరు, రాజంపేట మండలాల్లోని విండో చైర్మన్లు శనివారం తరలివెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం స్పందించి వెంటనే ఏకకాలంలో రూ.2లక్షల రుణమాఫీ చేయాలని, ఇటీవల కురిసిన వడగండ్ల వర్షానికి దెబ్బతిన రైతులకు ఎకరానికి రూ.15వేల నష్ట పరిహారం చెల్లించాలని కోరారు. అసైన్డ్‌భూములు ఉన్న రైతులకు రుణాలను అందజేయాలన్నారు. కార్యక్రమంలో విండో చైర్మన్లు నల్లవెల్లి ఆశోక్, వెంకట్‌రెడ్డి, భూంరెడ్డి, వెంకట్‌రెడ్డి, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

భిక్కనూరు ఇన్‌చార్జి ఎంపీడీవోకు సన్మానం

భిక్కనూరు, మార్చి30: భిక్కనూరు ఇన్‌చార్జి ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించిన ప్రవీణ్‌కుమార్‌ను ప్రజాప్రతినిధులు, కార్యాలయ సిబ్బంది శనివారం సన్మానించారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌ను శాలువతో సన్మానించి వారు పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతీ గ్రామంలో కార్యదర్శులు సమయపాలన పాటిస్తూ గ్రామాల్లో నీటిఎద్దడీ లేకుండా చర్యలు తీసుకోవాలని, 100శాతం పన్నులను వసూళ్లు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ గాల్‌రెడ్డి, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడే దయారి సాయిరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

గుండెపోటుతో ఒకరి మృతి

తాడ్వాయి, మార్చి 30: మండలంలోని కన్కల్ గ్రామంలో శుక్రవారం రాత్రి ఏనుగు తిరుపతిరెడ్డి (40) గుండెపోటుతో మృతిచెందినట్లు గ్రామస్థులు తెలిపారు. శుక్రవారం రాత్రి భోజనం చేశాక రోజు మాదిరిగానే నిద్రపోయాడని పడుకున్నచోటే గుండెపోటుతో రావడంతో మృతిచెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య దివ్య, కుమారుడు, కుమార్తెలు ఉన్నారు.

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి

దర్శన్ - రజాకార్, ఆడు జీవితం
శాంతి - ప్రేమలు
ప్రియా 70 - గాడ్జిల్లా ఎక్స్ కింగ్
ప్రియా 35 - ఓ భీం బూష్

బాన్సువాడ

మహేశ్వరి - టిల్లు స్క్వేర్
వెంకటేశ్వర - రజాకార్

చికెన్ ధరలు



రకం	:	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	100	160	180
వెన్‌కాబ్(కిలో)	:	100	180	210

